క్లుప్తంగా

కోటదుర్గమ్మ తిరువీధి రేపు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ తిరువీధి ఆదివారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు రోజు అమ్మవారి తిరువీధి నిర్వహించాల్సి ఉండగా.. ఆ రోజు తుఫాన్ కారణంగా తిరువీధి నిర్వహించలేకపోయామని ఆలయ కార్యనిర్వహణాధికారి సూర్యనారాయణ తెలిపారు. గ్రామ పెద్దల సూచనలు మేరకు దేవదాయ శాఖాధికారులు అమ్మవారి తిరువీధి 5వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారని తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గుర్తించి తిరువీధి ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

6న చలో సీతంపేట

సీతంపేట: ఈ నెల 6న చలో సీతంపేట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు బిడ్డిక శ్రీనివాసరావు, ఎస్.చిరంజీవి, బి.ఉమామహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పరిధిలో ఐటీడీఏ, గిరిజన గురుకుల పాఠశాలల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాలు, బదిలీలు బై లా ప్రకారం జరగాలని డిమాండ్ చేశారు. 2025 మెగా డీఎస్సీ నుంచి గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయ పోస్టులను మినహాయించాలన్నారు. వివిధ డిమాండ్లతో శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నామని, గిరిజనులంతా హాజరై విజయవంతం చేయాలన్నారు.

అరటి రైతులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే జయకృష్ణ



కంబరలో అరటితోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, అధికారులు

వీరఘట్టం: ఈదురుగాలులకు నష్టపోయిన అరటి రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని కంబరలో శుక్రవారం ఆయన పర్యటించి పడిపోయిన అరటి తోటలను పరిశీలించారు. జరిగిన నష్టంపై నివేదిక సిద్ధం చేయాలని ఉద్యానవన శాఖాధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు పాదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఉదయాన్ ఉదయ్‌భాస్కర్, బల్లా హరి, గొర్లె గౌరినాయుడు, తదితరులున్నారు.

తెగుళ్లపై అప్రమత్తం..

- పసుపు పంటకు తెగుళ్లు ఆశించే అవకాశం
- ఆకుమచ్చ తెగులు, ఆకుమడత పురుగులు ఆశించే అవకాశం
- ఎరువుల యాజమాన్యం పాటించాలి



పసుపు పంట

సీతంపేట: మన్యంలో సుమారు 8 వేల ఎకరాల్లో పసుపు పంట విస్తరించి ఉంది. ముఖ్యంగా సీతంపేట ఏజెన్సీలో పండే పసుపు నాణ్యమైనదనే నానుడి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు పసుపు మొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ పంటకు తెగుళ్లు ఆశిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆకుమచ్చ, ఆకుమడత పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంది. మోతాదుకు మించి ఎరువులు వినియోగించడం వల్ల తెగుళ్లు వ్యాపిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అధిక మోతాదులో ఎరువులు వేయవద్దని రైతులకు హార్టీకల్చర్ ఆఫీసర్ పేడాడ జయలక్ష్మి సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణపై పలు సూచనలు చేశారు.

ఆకుమచ్చ తెగులు..

వర్షాలు ఎక్కువగా కురిసినపుడు.. రోజుల తరబడి నీరు నిల్వ ఉన్నప్పుడు ఈ తెగులు ఆశిస్తుంది. ఈ తెగులు సోకిన మొక్కల ఆకులపై చిన్నచిన్న పసుపు రంగు చుక్కలు ఏర్పడి తర్వాత గోధుమ రంగు మచ్చలుగా మారుతాయి. తెగులు ఎక్కువగా ఉంటే ఆకులు మాడిపోతాయి. దీని నివారణకు తెగులు సోకిన ఆకులను తొలగించి విడోమిల్ ఎమ్‌జెడ్ 3 గ్రాములను లీటరు నీటికి లేదా ట్రైకోడెర్మావిరిడి 8 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రెండు రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

ఎరువుల యాజమాన్యం..

పసుపులో అధిక దిగుబడులు సాధించాలంటే సమగ్రమైన ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి. పసుపు నాణ్యతను పెంచాలంటే రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులను వినియోగించాలి. రసాయన ఎరువులతో పాటు వర్మీకంపోస్ట్ ఎరువులను ఎకరానికి నాలుగు టన్నుల చొప్పున వేస్తే నేలల్లో బలం పెరిగి దుంప పెరుగుదలకు ఉపయోగపడుతుంది.



పి.జయశ్రీ, హార్టికల్చర్ ఆఫీసర్

పసుపు పంటకు ఎక్కువ పోషకాలు అవసరం ఉన్నందున ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. దుక్కిలో పశువుల ఎరువు 10 టన్నులు, వేపపిండి 200 కిలోలు, సూపర్ ఫాస్ఫేట్ 150 కిలోలు, పొటాష్ 25 కిలోలు వేయాలి. విత్తనం నాటిన 40 రోజులకు యూరియా 50 కిలోలు వేయాలి. 80 రోజులకు యూరియా 50 కిలోలు, పొటాష్ 25 కిలోలు, 200 కిలోల వేపపిండి వేయాలి. అలాగే 120 రోజులకు యూరియా 50 కిలోలు, పోటాష్ 25 కిలోలు వేయాలి. ఈ విధంగా ఎరువులు వేస్తే నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.

నేడు శోభాయాత్ర



మంటపంలో భక్తులచే పూజలు అందుకుంటున్న శక్తి స్వరూపిణులు

పాలకొండ రూరల్: విజయదశమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక నక్కలపేట షిర్డీ సాయి సకల దేవతా మందిరంలో కొలువుదీరిన అష్టాదశ శక్తిపీఠ మంటపంలో గురు, శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. దసరా నేపథ్యంలో 11 రోజులు సంప్రదాయ పూజల అనంతరం అమ్మవార్ల శోభాయాత్ర శనివారం వైభవంగా చేపట్టనున్నట్లు అర్చకుడు శరత్‌కుమార్ తెలిపారు. శక్తిపీఠంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పవిత్ర నాగావళి నదిలో విగ్రహాలను నిమజ్జనం చేయనున్నట్లు చెప్పారు. అలాగే నాగవంశపు వీధి కూడలిలో కొలువైన పోలమాంబ తిరువీధి కార్యక్రమం గురువారం సంప్రదాయబద్ధంగా భక్తులు నిర్వహించారు.

అమ్మవారి సేవ మా పూర్వజన్మ సుకృతం



సన్మానసభలో మాట్లాడుతున్న నగర పాలకమండలి సభ్యులు మన్మధరావు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పాలకొండ కోటదుర్గమ్మ సేవ చేయడం తమ పూర్వజన్మ సుకృతమని పూర్ణచంద్ర దాస్, శరత్‌చంద్ర దాస్, వెంకటేశ్వర దాస్ అన్నారు. తమ తాత కృష్ణవల్లభ దాస్‌కు అమ్మవారు కలలో దర్శనమిచ్చి ఆమెను కొలిచే భాగ్యం కల్పించడం ద్వారా అప్పటి నుంచి తమ కుటుంబీకులు అమ్మ సేవ చేస్తున్నట్లు తెలిపారు. కాలక్రమంలో ఆలయం దేవదాయ శాఖ పరిధిలోకి చేరడం జరిగిందన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం వీరికి పౌర సన్మానం జరిగింది.

దేవస్థానం ప్రాంగణంలో నగరపాలక మండలి సభ్యులు, పలువురు రాజకీయ, వ్యాపార, సామాజికవేత్తలతో పాటు అర్చకులను సత్కరించారు. కార్యక్రమంలో పల్లా కొండలరావు, వెమల మన్మధరావు, జి.సంతోష్‌కుమార్, బాబి, కె.రవికుమార్, భాసూరు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాల్లో పవిత్రోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, బాలభోగం, మంగళశాసనం, విశేషార్చనలు, పతాకావిష్కరణ, ధ్వజారోహణం, హోమం తదితర పూజలు చేపట్టారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

పెద్దూరులో గ్రామసభ

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరులో గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం పనులపై చర్చించారు. ఎంపీడీవో జి.పైడితల్లి ఈ కార్యక్రమంలో పాల్గొని, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకే గ్రామసభలు నిర్వహించడం జరుగుతోందన్నారు. సభలో సర్పంచ్ ఎం.నారాయణమ్మ, ఉపసర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు, కార్యదర్శి బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని రావుపల్లిలో సర్పంచ్ బొంతాడ మహేశ్వర్యం ఆధ్వర్యంలో కూడా గ్రామసభ నిర్వహించారు.



బత్తిలి వద్ద వంశధార వరదను పరిశీలిస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఏడీ రాబర్ట్ పాల్, తదితరులు

నష్టాలపై అంచనా

భామిని: భారీ వర్షాలు, ఈదురుగాలులకు జరిగిన పంటనష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో ఒక బృందం.. జిల్లా వ్యవసాయశాఖ సంచాలకుడు రాబర్ట్‌పాల్ ఆధ్వర్యంలో మరో బృందం బత్తిలి, నేరడి, గురండి, బిల్లుమడ, భామిని, ఘనసర, కీసర, కోసలి గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా నష్టపోయిన పంటలను పరిశీలించారు.

పరిశీలనలో వ్యవసాయశాఖ ఏడీఏ రత్నకుమారి, తహసీల్దార్ శివన్నారాయణ, ఏఓ కొల్లి తిలక్, మండల అధికారులున్నారు.

జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ జ్ఞాన ప్రసూనాంబ

గుమ్మలక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం 431 వస్తువులపై జీఎస్టీ చార్జీలను తగ్గించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ జ్ఞాన ప్రసూనాంబ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎల్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె..జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్య తరగతి ప్రజలపై కొనుగోలు భారం తగ్గిందన్నారు. సవరించిన జీఎస్టీ శ్లాబ్‌ల ప్రకారమే వస్తువులు విక్రయించాలని దుకాణదారులను ఆదేశించారు. ఆమె వెంట డీఎస్‌డీవో డి.శ్రీనివాస్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి



పాలకొండ రూరల్: సబ్ జైల్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో మహాత్మా గాంధీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ పరిపాలనాధికారి వి.సునీల్ జాతిపిత గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: జాతిపిత గాంధీ జయంతి కార్యక్రమాలు పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు ఆధ్వర్యంలో.. సబ్‌జైల్‌లో సూపరింటెండెంట్ బి. జోగులు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖైదీలకు మిఠాయిలు పంచిపెట్టారు.



సీతంపేట: గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సిబ్బంది

భవానీ భక్తుల హోమం



హోమంలో పాల్గొన్న భవానీ భక్తులు

వీరఘట్టం: పట్టణంలో 11 రోజులుగా దీక్ష చేపట్టిన భవానీ భక్తులు శుక్రవారం ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో స్థానిక కోదండ రామ కల్యాణ మంటపంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. అంతకుముందు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం 121 మంది భక్తులు విజయవాడ పయనమయ్యారు.



పాలకొండ రూరల్: వెలగవాడ సమీపంలో నేలకొరిగిన పొట్ట దశలో ఉన్న వరిపంట



పాలకొండ రూరల్: పాలకొండ - వీరఘట్టం రహదారిపై చేరిన వరద నీరు



భామిని: కాట్రగడ వద్ద ఏబీ రోడ్డుపై చేరిన వరదనీరు



సీతంపేట: నేలకొరిగిన అరటి చెట్లు



పాలకొండ రూరల్: తంపటాపల్లిలో పంట భూములు పరిశీలిస్తున్న అధికారులు

తెరిపివ్వని వర్షం..

- పొంగి పొర్లుతున్న గెడ్డలు
- భారీ గాలులకు నేలకొరిగిన అరటి
- వరి పంటకు తప్పని నష్టం

పాలకొండ రూరల్: అల్పపీడన ప్రభావంతో గురువారం వేకువజాము నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో అన్నివర్గాల ప్రజలు అవస్థలు పడ్డారు. ముఖ్యంగా పొట్ట దశలో ఉన్న వరి పంటపై ఈ ప్రభావం పడింది. ఎగువ ప్రాంతాలతో పాటు స్థానికంగా నమోదైన వర్షంతో మండలంలోని ఒనిగెడ్డ, రావాడగెడ్డ, కొత్త గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. అన్నవరం, తంపటాపల్లి, తదితర ప్రాంతాల్లోని వరి పొలాల్లో నీరు చేరింది. అలాగే వెలగవాడ, సిరికొండ ప్రాంతాల్లో గాలుల ఉధృతికి వరి పంట నేలకు వాలిపోయింది. దాదాపు 4 వందల ఎకరాల్లో నష్టం ఏర్పడి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. పాలకొండ - వీరఘట్టం రహదారిపై నీరు చేరడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. మండల వ్యవసాయాధికారి వరప్రసాద్‌తో పాటు రెవెన్యూ, గ్రామీణ వ్యవసాయ సహాయకులు పంట నష్ట అంచనా వేసేందుకు శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు.


భారీ వర్షంతో నేలకొరిగిన అరటి

సీతంపేట: మండల వ్యాప్తంగా శుక్రవారం కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల అరటిపంట నేలకొరిగింది. దిబ్బగూడకు చెందిన శ్రీను అనే రైతు ప్రకృతి వ్యవసాయంలో వేసిన అరటి పంటకు నష్టం వాటిల్లింది. అలాగే మరికొన్ని చోట్ల నష్టం ఏర్పడింది. మరికొన్ని గ్రామాల్లో పత్తి పంట నాశనమైంది. సీతంపేట – కొత్తూరు రహదారికి ఇరువైపుల ఉన్న చెట్లు విరిగిపోయాయి.

ఉప్పొంగిన వంశధార

భామిని: ఒడిశాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వంశధార పొంగి ప్రవహిస్తోంది. పాలకొండ నియోజకవర్గ వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు కూడా పొంగి పొర్లుతున్నాయి. బత్తిలి – భామిని రోడ్డుపైకి కాట్రగడ స్వామి తంపర నీరు చేరడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. వంశధార ప్రాజెక్ట్ ఓపెన్ హెడ్ చానల్ ద్వారా సుమారు ఐదు వేల క్యూసెక్కుల నీరు వరదకాలువల్లోకి చేరిందని ఇంజినీర్లు తెలిపారు.

ఒట్టిగెడ్డ కాజ్‌వేపై వంతెన నిర్మించండి



ఒట్టిగెడ్డ కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

జియ్యమ్మవలస రూరల్: ఒట్టిగెడ్డ కాజ్‌వేపై మినీ వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. గత రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని రావాడ ఒట్టిగెడ్డ ప్రాజెక్టు నీటిమట్టం 399 అడుగుల గరిష్ట స్థాయికి చేరింది. దీంతో శుక్రవారం ఉదయం 5 గంటలకే ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు రెండు ప్రధాన గేట్ల ద్వారా 1600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో కాజ్‌వే మీదుగా నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రావాడ-రామభద్రపురం గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అలాగే టీకే జమ్ము, పీటీ మండ, కొండచిలకాం పంచాయతీల్లోని 30 గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కనీసం నిత్యావసర సరుకులు కూడా కొనుగోలు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మిస్తేనే కాజ్‌వే దాటగలమన్నారు.



ఒట్టిగెడ్డలో భారీగా వరదనీరు

ఒట్టిగెడ్డకు పోటెత్తిన వరద నీరు

వీరఘట్టం: తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా గురువారం రోజంతా కురిసిన వర్షానికి స్థానిక ఒట్టిగెడ్డకు వరద నీరు పోటెత్తింది. శుక్రవారం కూడా గెడ్డలో నీటి ప్రవాహం పెరగడంతో గెడ్డ పరీవాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



గుమ్మలక్ష్మీపురం: దుడ్డుఖల్లులో నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి శంకరరావు

గాలివాన బీభత్సం!

తుపాను కారణంగా గాలివాన బీభత్సం సృష్టించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు, నదులు వరదనీటితో పొంగిపొర్లుతున్నాయి. కొన్నిచోట్ల ఈదురుగాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో పాటు అరటి, వరి పంటలు నేలమట్టమయ్యాయి. మరికొన్ని చోట్ల లోతట్టు ప్రాంతాల్లోని పంటపొలాలు నీటమునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

–సాక్షి నెట్‌వర్క్, కురుపాం



కురుపాం: రోడ్డుపై కూలిన చెట్టు



కొమరాడ: కళ్లకోట గ్రామంలోకి చేరిన నాగావళి వరదనీరు



జియ్యమ్మవలస/జియ్యమ్మవలస రూరల్: బాసంగి నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పాలకొండ సబ్‌కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్



జియ్యమ్మవలస/జియ్యమ్మవలస రూరల్: ముంపు ప్రాంతాల్లో సీపీఎం నాయకుల పర్యటన



గరుగుబిల్లి: రావుపల్లిలో దేసూరుగెడ్డ పరిసరాల్లో నీటమునిగిన వరిపంట



కొమరాడ: నేలమట్టమైన విద్యుత్‌స్తంభం